## • నీళ్లు ఇవ్వకపోతే చావే శరణ్యం



మద్దూరు(ధూళిమిట్ట)/నర్మెట, మార్చి 17: సాగునీళ్ల కోసం సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం లద్నూర్, ధర్మారం గ్రామాల రైతులు సోమవారం జనగామ జిల్లా నర్మెట మండలం బొమ్మకూర్ పంపు హౌస్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. దేవాదుల నీటిని నమ్ముకొనే వరి సాగు చేశామని, పొట్ట దశలో ఉన్న పంటలు ఎండిపోతున్నాయని, నీళ్లు రాకపోతే చావే శరణ్యమని రైతులు పేర్కొన్నారు. లద్నూర్ రిజర్వాయర్‌కు బొమ్మకూర్ పంపుహౌస్ ద్వారా ఏటా సాగు నీటిని విడుదల చేసేవారని, దీంతో సాగునీరు అందడంతోపాటు భూగర్భ జలాలు ఉండేవని చెప్పారు. ఈ సారి నీళ్లు విడుదల చేయకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే నీటిని విడుదల చేయాలని అధికారులను కోరారు. నిరసనలో లద్నూర్ మాజీ సర్పంచ్ జీడికంటి సుదర్శన్, మాజీ ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, కాసర్ల కనుకరాజు, పాకాల ఆదాం, నంద శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్, కాసర్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## • సాగునీటి కోసం నడిరోడ్డుపై టెంట్..



రాయపోల్, మార్చి 17 : తలాపున గోదావరి నీళ్లు పారుతున్నప్పటికీ తమ పంట పొలాలకు నీరందక ఎండిపోతున్నాయని మెదక్ జిల్లా చేగుంట మండలంలోని పలు గ్రామాల రైతులు సోమవారం సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ చౌరస్తాలోని రామాయంపేట కెనాల్ వద్ద రోడ్డుపై టెంట్లు వేసుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. దీంతో గజ్వేల్-చేగుంట ప్రధాన రహదారిలో కిలోమీటర్ల మేర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మెదక్ జిల్లా చేగుంట మండలంలోని పోతన్‌పల్లి, చందాయిపేట, కసాన్‌పల్లి, పోతంశెట్‌పల్లి, మక్కరాజ్‌పేట, సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని మాచిన్‌పల్లితో పాటు తదితర గ్రామాలకు చెందిన సుమారు 500 మంది రైతులు రోడ్డుపై బైఠాయించారు.

## • ఫోన్ కొట్టు.. ట్యాంకర్ పట్టు..



మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం ఇబ్రహీంబాద్‌కు చెందిన రైతు నర్సింహులు ఎకరా పొలంలో వరి సాగు చేశాడు. ఇంకా 20 రోజుల్లో పంట చేతికొస్తుందన్న సమయానికి బోరులో నీటిమట్టం తగ్గిపోయింది. దీంతో నీళ్లందక పంట కండ్ల ముందే ఎండిపోతుండడంతో ఎలాగైనా కాపాడుకోవాలని ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చి పంట పొలాన్ని తడుపుతున్నాడు. ట్రిప్పునకు రూ.500 చెల్లించి.. రోజుకు 4 నుంచి 6 ట్రిప్పుల వరకు ట్యాంకర్ ద్వారా నీటిని పంటకు పారిస్తున్నాడు. -హన్వాడ

## • ప్రతిబొట్టూకు ఓ లెక్క...



భూగర్భ జలాలు అడుగంటుతుండడం, ఎండలు మండుతుండంతో సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలే చేస్తున్నారు. వాటర్ ట్యాంకర్లతో నీళ్లు పడుతున్నారు. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం కోమట్‌పల్లికి చెందిన రైతు నాయిని బాల్‌రాజ్ ఎకరా విస్తీర్ణంలో దోసకాయ సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం కాత కాసే తరుణంలో బోరు ఎత్తిపోయింది. దీంతో బాల్‌రాజ్ పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీరందిస్తున్నాడు. - లింగంపేట

## • పంటలను కాపాడేందుకు అన్నదాతల భగీరథ ప్రయత్నం



మరిపెడ, మార్చి 17: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తండధర్మారం, సీతారాంతండాకు చెందిన గుగులోత్ రాజు, గుగులోత్ తిరుపతి, మూడ శ్రీనుకు చెందిన నాలుగు బోరు బావుల్లో నీళ్లు అడుగంటాయి. ముగ్గురు 12 ఎకరాల్లో సాగు చేసిన పంటలు ఎండిపోతుండగా, వాటిని పాడుకునేందుకు ఎక్స్‌వేటర్ సాయంతో ఆకేరు వాగులో పెద్దపెద్ద గుంతలు తీసి మోటర్లతో పంట పొలాలకు నీరు పారించుకుంటున్నారు.

## • ఎండిన పంటలను పరిశీలించిన రసమయి..



బెజ్జంకి, మార్చి 17: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుండారంలో ఎండిన వరి పంటలను మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సోమవారం పరిశీలించారు. చౌడారం నుచిడి వచ్చే కాలువకు మరమ్మతులు చేసి ఉంటే పంట ఎండే పరిస్థితి వచ్చేది కాదన్నారు. చౌడారం నుంచి వచ్చే ప్రధాన కాలువ వద్దకు వెళ్లి గుండారం గ్రామానికి సాగు నీరు అందించే విధానాన్ని పరిశీలించి అధికారులతో ఫోన్లో మాట్లాడగా సానుకూలంగా స్పందించి సాగు నీరు అందిస్తామని తెలిపారు.

## • సాగునీటి కోసం.. గొంగిడి సునీత పాదయాత్ర



గుండాల, మార్చి 17 : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలానికి నవాబ్‌పేట రిజర్వాయర్ నుంచి దేవాదుల కాల్వల ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పోరుబాట పట్టారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి సోమవారం బురుజుబావి గ్రామం నుంచి వెల్మజాల వరకు దేవాదుల కాల్వ వెంట పాదయాత్ర చేశారు. దేవాదుల కాల్వలు, ఎండిన పంటలను పరిశీలిస్తూ మధ్యమధ్యలో రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ భూగర్భ జలాలు అడుగంటి బావులు, బోర్లలో నీళ్లు లేక పొలాలు ఎండిపోతున్నాయని తెలిపారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మాట్లాడి గుండాల మండలానికి దేవాదుల కాల్వల ద్వారా సాగు నీరు అందించేలా కృషి చేయాలని సూచించారు.

## • ఒకే సారి మూడు బోర్లు ...బొట్టు నీరూ రాలే



రైతు వెంకటేశంకు చెందిన 2.20 ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నా. గత మూడేండ్ల కిందట ఒక బోరు వేశా. అందులో కొద్ది పాటి నీరు రావడంతో కంది, పత్తి, పసుపు తదితర పంటలను సాగు చేశా. కొద్ది రోజుల కిందట బోరుమోటర్ పైపులు తెగి బోరు బావిలోనే పడిపోయాయి. ఎంత ప్రయత్నించినా ఫలితంలేదు. దీంతో 20 రోజుల కిందట ఒకేసారి 620, 550, 500 ఫీట్ల వరకు మూడు బోర్లు తవ్వించా. ఒక్క దానిలోనూ నీళ్లు రాలే. బోరు వేస్తే నీళ్లు వస్తాయన్న ఆశతో పొలంలో డ్రాగన్ ఫ్రూట్స్ వేద్దామని రూ.30 వేలకు డ్రిప్ పరికరాలను కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్నా. బోర్లు వేయడంతో దాదాపుగా రూ.3 లక్షల వరకు అప్పులయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలి. -మొల్ల ఖాజా, వికారాబాద్ జిల్లా

## • ప్రభుత్వానికి చీమకుట్టినట్టూ లేదు..



పుల్కల్, మార్చి 17: నీళ్లులేక పంటలు ఎండిపోతుండడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేదని సంగారెడ్డి జిల్లా అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. పుల్కల్ మండలం హుమ్లా నాయక్ తండా,లక్ష్మీసాగర్ శివారులో ఎండిన వరి, మొక్క జొన్న పంటలను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జైపాల్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. పక్కనే సింగూరు ప్రాజెక్టులో 20 టీఎంసీల నీరున్నా సాగునీరు వదలక పోవడంతో పంటలన్నీ ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## • చెరువుకు గండికొట్టే యత్నం

వనపర్తి, మార్చి 17 (నమస్తే తెలంగాణ): వనపర్తి జిల్లాలో ఎగువనున్న దొడగుంటపల్లి చెరువు కట్టకు గండి పెడితే నీరు దిగువకు పారుతుందని పెద్దమందడికి చెందిన 20 మంది రైతులు సోమవారం జేసీబీతో వచ్చారు. సమాచారం తెలుసుకున్న దొడగుంటపల్లి రైతులు 50 మంది అక్కడకు చేరుకొని అడ్డుకున్నారు. ఇరిగేషన్ అధికారులు జోక్యం చేసుకోవడంతో సమస్య సద్దుమణిగింది.



## • సాగునీరు కరువై.. రైతు గుండె చెరువై..



రామారెడ్డి, మార్చి 17: కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని పోసానిపేట్ గ్రామానికి చెందిన పోతుల చంద్రయ్య అనే రైతు తనకున్న మూడెకరాల్లో వరి వేశాడు. పంట పొట్టదశకు రాగా..ఎండలు ముదరడంతో బోర్లు ఎత్తిపోయాయి. దీంతో సాగునీరు అందక పంట ఎండిపోతుండటంతో పశువుల మేతకు వదిలేశాడు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల గోస



- కర్షకులను కాపాడాలన్న చిత్తశుద్ధి రేవంత్‌కు లేదు
- ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి: నిరంజన్‌రెడ్డి

వనపర్తి, మార్చి 17 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు గోస పడుతున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం వనపర్తి జిల్లా పెద్దగూడెం తండాలో ఎండిన వరి పంటలను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఎండిన పంటలకు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పెద్దగూడెం తండా శివారులో ఎండిన పంటలను పరిశీలించేందుకు వచ్చిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఓ రైతు కష్టాన్ని చూసి చలించిపోయారు. హైదరాబాద్‌లో ఆటోనడవక జీవ్లా నాయక్ సొంతూరైన తండాకు వచ్చి మూడెకరాల పొలంలో నాట్లు వేసుకుంటే.. నీళ్లులేక మొత్తం ఎండిపోయిందని రైతు భార్య శాంతమ్మ కన్నీరుమున్నీరైంది. నాలుగు బోర్లు పని చేయడం లేదని, దీంతో వరి ఎండిపోయిందని వాపోయింది. ఇలా తండాలో ఇప్పటి వరకు 20 మందికి చెందిన 40 ఎకరాల్లో వరి పంట పూర్తిగా ఎండిపోయిందని గిరిజన రైతులు నిరంజన్‌రెడ్డి దృష్టికి తెచ్చారు.

# అప్పులబాధతో ముగ్గురు రైతుల బలవన్మరణం


› మొదటిపేజీ తరువాయి...





చేయగా, దిగుబడి సరిగా రాక, అప్పు తీర్చే దారి లేక మనస్తాపం చెందాడు. సోమవారం పొలానికి వెళ్లి పురుగులమందు తాగడంతో కుటుంబ సభ్యులు దవాఖానకు తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందాడు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం ప్రగతి ధర్మారంలో యువరైతు మాసాయిపేట పురుషోత్తం (34) తన పొలంలో చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. యాసంగిలో పొలంలో ఉన్న బోరు నీళ్లు తగ్గడంతో నాలుగు బోర్లను తవ్వించాడు. ఒక్కో బోరు 400 అడుగుల వరకు వేయించినా నీటిచుక్క రాలేదు. దీంతోపాటు యాసంగిలో వేసిన రెండెకరాల పొలం ఎండిపోయింది. రూ.6 లక్షల వరకు అప్పులు కావడంతో మనస్తాపం చెందాడు. పొలం వద్దకు వెళ్లి నీళ్లు పెడతానని ఆదివారం సాయంత్రం ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి 11 గంటలైనా ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా పురుషోత్తం చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలకేంద్రంలో ఆర్థిక ఇబ్బందులు తాళలేక పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్ (58) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రవీందర్ కంచనపల్లి చైర్మన్ పదవితోపాటు సొంతంగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సొసైటీలో అవకతవకలు జరిగినట్టు ఇటీవల ఆయనపై ఫిర్యాదులు రావడంతో అధికారులు బహిరంగ విచారణ జరిపి రవీందర్ రూ.17 లక్షలు దుర్వినియోగం చేసినట్టు నిర్ధారించారు. దీంతో మండల కేంద్రంలో తనకున్న ఎనిమిది ఎకరాల భూమిలో 1.18 ఎకరాలు విక్రయించి ఆ మొత్తాన్ని చెల్లించాడు. దీనికి తోడు 2019లో సొసైటీ ఎన్నికల సమయంలో ఖర్చులు, ఇతరత్రా కలిపి రూ.కోటి దాకా అప్పులయ్యాయి. అప్పటినుంచి తరచూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో తీవ్ర మానసిన వేదనకు గురై ఈ నెల 8న వ్యవసాయ క్షేత్రంలో పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు.